క్లుప్తంగా

నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న పెద్దిరెడ్డి

సదుం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు ప్రధాన మంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ కార్యక్రమంలో భాగంగా ఆటస్థలం, సైన్స్ ల్యాబ్ మంజూరు చేశారని కన్వీనర్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. సైన్స్ ల్యాబ్‌కు రూ.2 లక్షలు, ఆటస్థలానికి లక్ష రూపాయలు మంజూరు అయినట్టు ఆయన చెప్పారు. వీటి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీలగిరి వృక్షాల వేలం

శాంతిపురం: మండలంలో చిన్నారిదొడ్డి పంచాయతీలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న 269 నీలగిరి వృక్షాల వేలంతో పంచాయతీకి రూ 10.15 లక్షల ఆదాయం లభించింది. కొత్తపేట పెద్దచెరువు, రాసాయకుంట, చింతమానికుంటల్లో ఉన్న నీలగిరి చెట్లను బుధవారం పంచాయతీ కార్యాలయంలో వేలం వేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ఈశ్వరన్, సర్పంచ్ బాలసుబ్రమణ్యం, ఎంపీటీసీ బీఎస్ వెంకటేశు, పంచాయతీ కార్యదర్శులు వనిత, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



వార్షికోత్సవంలో బ్యాంకు సిబ్బంది, నాయకులు

సదుం: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు పదేళ్లుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు బ్రాంచ్ మేనేజర్ రాంబాబు చెప్పారు. బుధవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో బ్రాంచ్ పదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రజనీకుమార్, సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గౌరీకుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, హరినాథరెడ్డి, హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

శాంతిపురం: తహసీల్దార్‌గా మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా గుడిబండ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికొచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, రీ సర్వే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు.

వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని కోనేటిపాళ్యం అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం గర్భవతులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను కౌన్సిలర్ పూల త్యాగరాజు పంపిణీ చేశారు. మాతా–శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి, ఈ కిట్లను అందజేస్తోందన్నారు. రాబోవు ఎన్నికల్లో మహిళలంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వి.కోట: మండలంలోని బైరుపల్లె నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ఏపీ 03 బిబి 7412 నంబరు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు సీఐ లింగప్ప బుధవారం తెలిపారు. అనంతరం ట్రాక్టర్‌ను మైనింగ్‌శాఖకు అప్పగించినట్లు చెప్పారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం



మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని నూతన ఆర్‌ఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను పకడ్బందీగా సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ



విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలిస్తున్న అజయ్‌కుమార్ రెడ్డి

సోమల: మండలంలోని ప్రాథమిక పాఠశాలను ఏఎల్ఎస్ఓ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. ఏ విధంగా రాస్తున్నారు? ఉపాధ్యాయులు కరెక్షన్ చేశారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్య, సీఆర్పీ సోమశేఖర్ పాల్గొన్నారు.

నవరత్నాలతోనే రాష్ట్రం సుభిక్షం

● మున్సిపల్ చైర్మన్ సుధీర్



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సుధీర్



పేపరు ప్లేట్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకాలతోనే రాష్ట్రంలో పేదరికం తగ్గిందని, పేదల కుటుంబాల్లో వెలుగులు నింపారని కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రాజన్న క్యాంటీన్ వద్ద హ్యాండ్ వాష్ మెషిన్, పేపర్ ప్లేట్ల స్వయం ఉపాధి యూనిట్‌ను ప్రారంభించారు. అలాగే షికారీల కాలనీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరంలో మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీ, నాయకులు, కార్యకర్తల జేబులు నింపడానికే ప్రాధాన్యతనిచ్చిందని, ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పలు పథకాలు అమలు చేసిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ పథకాలతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు బదిలీ చేస్తూ, ఎలాంటి అవినీతికి చోటు లేకుండా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులైతే చాలు ప్రతి పథకం ఇంటివద్దకే వచ్చేలా ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు కుప్పం మున్సిపాలిటీ ప్రత్యేకంగా నిధులు కేటాయించి, అభివృద్ధికి బాటలు వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు, నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నతోనే పేదలకు మేలు



గుడ్లనాయనపల్లెలో మహిళలతో దుర్గ

కుప్పం రూరల్: జగనన్నతోనే పేదలకు ఎంతో మేలు కలిగిందని, భవిష్యత్తులోనూ ఆయనతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ అన్నారు. బుధవారం మండలంలోని క్రిష్ణదాసనపల్లె, గుడ్లనాయనపల్లె, ఉర్లవోబనపల్లెలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. మహిళలకు పసుపు, కుంకుమ, చీరను సారెగా అందజేసి మాట్లాడారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ పథకాలు రూపొందించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆయన చేసిన మేలును దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కుప్పంలోను వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగురవేసి జగనన్న రుణం తీర్చుకుందామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిప్రసాద్, నారాయణప్రసాద్, అబ్బు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్

పుంగనూరు: జగనన్న కాలనీలలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ సజావుగా సాగుతున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ రిజిస్ట్రేషన్ల సెంటర్లలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. కొన్ని సాంకేతిక కారణాలు, సర్వర్ స్తంభన వల్ల ఆలస్యమవుతోందని చెప్పారు. అయినప్పటికీ సకాలంలో సుమారు రెండువేల రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగనివ్వరాదని సిబ్బందిని ఆదేశించారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న బహుజన సంఘాల నాయకులు

పెద్దపంజాణి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల పట్ల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బహుజన సంఘాల నాయకులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, దాసార్లపల్లెకు చెందిన వెంకటస్వామి, శ్రీరామాపురం వద్ద దళిత చెంగయ్య తదితరుల భూములకు పాసు పుస్తకాలు ఇవ్వకుండా, ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని, అలాగే దిన్నిపల్లె గ్రామ శ్మశానం ఆక్రమణ పాలైనా పట్టించుకోలేదని విమర్శించారు. సమస్యలు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని డీటీ ఫణికుమార్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అశోక్, జాతీయ మానవ హక్కుల నాయకులు డీపీ.మునిరత్నం, వేలాయుధం, మండల నాయకులు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



కంచిదాసనపల్లెలో నిర్వహిస్తున్న ర్యాలీ



పెద్దపంజాణి: చలమంగళంలో..

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లె పంచాయతీ కంచిదాసనపల్లెలో బుధవారం రామకుప్పం వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం లావణ్య మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ దీనిని వినియోగించుకోవాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు ప్రధానమైందన్నారు. మహిళలు, వృద్ధులు పోలింగ్ సమయంలో తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీసీ జనార్ధన్, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: మండలంలోని బట్టందొడ్డి, నిడిగుంట, పెద్దకాపల్లె, చలమంగళం, తుర్లపల్లెలో బుధవారం ఓటుహక్కుపై స్వయం సహాయక సంఘాల గ్రూపు మహిళలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు సీసీలు వసంత, సుగుణ, చిన్నా, హేమలత, శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందన్నారు. ఓటు వేయడం కూడా ఓటరు కర్తవ్యమన్నారు. పలువురు సంఘమిత్రలు పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్‌తో ఓటుహక్కుపై అవగాహన



పలమనేరు: ఈవీఎంలతో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు: మున్సిపాలిటీలోని కేవీ స్ట్రీట్, గొబ్బిళ్ల కోటూరు, గంటావూరు పోలింగ్ కేంద్రాల్లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బంది బుధవారం ఈవీఎంల ద్వారా ఓటుహక్కును ఎలా వినియోగించుకోవాలో మాక్‌పోలింగ్‌తో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్ల అనుమానాలను ఆయన నివృత్తి చేశారు. ఇదే కార్యక్రమం గురువారం పట్టణంలోని గంగమ్మతోపు, పలమనేరులోని ఏడు పోలింగ్ స్టేషన్లలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ, మండల కన్వీనర్

పెద్దపంజాణి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ రెడ్డెప్ప, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని శంకర్రాయలపేట, శివాడి, నిడిగుంట, ముదరంపల్లె, బొమ్మరాజుపల్లె, అమ్మరాజుపల్లెలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన కలసి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకున్నా ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, మాజీ చైర్మన్ శంకరప్ప, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు ఏర్పాటు

సదుం: మండలంలోని పాపిరెడ్డిగారిపల్లె క్రాస్ సమీపంలో అంతర్‌జిల్లా చెక్‌పోస్టును బుధవారం ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ మారుతి తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమంగా తరలిస్తే జప్తు చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు.

కస్తూర్బా స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న కేసీ ఆసుపత్రి వైద్యులు

గుడుపల్లె: కస్తూర్బా గురుకుల స్కూల్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కుప్పం కేసీ ఆసుపత్రి వైద్యులు శిల్ప, మంజునాథ్ విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, మాత్రలను అందజేశారు. ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

నులిపురుగుల నిర్మూలనకు సహకరిద్దాం



పుంగనూరు: నులిపురుగుల నిర్మూలన పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీపీ



ఎంఈఓ సాయిలీలకు మాత్రలు అందజేస్తున్న వైద్యాధికారి

పుంగనూరు: నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పోస్టర్లను విడుదల చేసి ఎంపీపీ మాట్లాడారు. చిన్నపిల్లల్లో నులిపురుగులను నిర్మూలించాలని, ప్రభుత్వం ఇస్తున్న మాత్రలను విద్యార్థులకు మింగించాలని కోరారు. అలాగే మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణపై సమావేశం నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఎంపీడీఓ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి, డాక్టర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు

బైరెడ్డిపల్లె: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను బుధవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర ఎంఈఓ సాయిలీలకు అందజేశారు. ఈనెల 9న నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలు అందజేయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



కల్లూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి



హాజరైన మహిళలు

పులిచెర్ల(కల్లూరు): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నివిధాలా ఆదుకుంటున్నారని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి అన్నారు. కల్లూరులో బుధవారం జెడ్పీ బంగ్లా, పాతపేట, చల్లావారిపల్లె, మతుకువారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీలలో ఆసరా సంబరాలు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల ఖాతాలలో డబ్బు జమ చేసి రుణ మాఫీ చేశారన్నారు.మండలంలో 963 సంఘాలకు ఆసరా సొమ్ము రూ.47.83కోట్లు కాగా, 4వ విడతలో రూ. 11.96 కోట్లు మంజూరు చేశారన్నారు. మహిళలను ఇన్ని విధాలా ఆదుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, సర్పంచ్ షుకూర్, నటరాజ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, నాయకులు చంద్రశేఖరరెడ్డి, గోవిందరెడ్డి, షౌకత్ అలీ, సీసీ వాహిద్‌బాషా, మహిళలు పాల్గొన్నారు.

డీఎస్పీగా మహేశ్వర్‌రెడ్డి



పలమనేరు: పలమనేరు డీఎస్పీగా మహేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పోలీసులు ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తామని, వచ్చే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

21న ఆలయ వార్షికోత్సవం

పుంగనూరు: పట్టణంలోని తూర్పు మొగశాల వద్ద ఉన్న శ్రీచాముండేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం ఈనెల 21న నిర్వహించనున్నామని జెట్టికుల సంఘ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవారం కరపత్రాలను విడుదల చేశారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య ఆధ్వర్యంలో 21, 22 రెండు రోజుల పాటు హోమాలు, పూర్ణాహుతి, ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



జగనన్న సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

పుంగనూరు: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. బుధవారం కొత్తపేట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష–2 శిబిరాన్ని చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పలువురిని డాక్టర్లు మాధవరెడ్డి, రంజిత, పుష్ప శ్రీ, పరీక్షించి మందులు అందజేశారు. కౌన్సిలర్లు మమత, సాజిదాబేగం, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పీఆర్సీ వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పలమనేరు: పన్నెండో పీఆర్సీని ప్రభుత్వం వేగవంతం చేయాలని స్థానిక ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు మనోహర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక పెన్షనర్ల భవనంలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదకొండో పీఆర్సీలోని బకాయిలు, అడిషనల్ క్వాంటమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో ఎలా సమర్పించాలో వివరించారు. అసోసియేషన్ నేతలు రత్నారెడ్డి, గురుమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



బాటగంగమ్మను దర్శించుకుంటున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని లక్కనపల్లె సచివాలయ పరిధిలోని రామనపల్లెలో మంగళవారం రాత్రి వైభవంగా గంగజాతర నిర్వహించారు. గ్రామ పొలిమేరలో అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల మీదుగా ఊరేగిస్తూ ఆలయం వద్దకు చేరుకున్నారు. బుధవారం ఉదయం ప్రతిష్ఠించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నికలకు ‘సిద్ధం’



‘సిద్ధం’ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడుపల్లె: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు తామంతా సిద్ధమని, వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నవరత్నాల పథకాల గురించి గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేసి, ప్రతి బూత్‌లో మెజార్టీ సాధనే ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు. జెడ్పీటీసీ క్రిష్ణమూర్తి, మండల కన్వీనర్ రామక్రిష్ణ, కో–కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు రామమూర్తి, చెన్నరాయన్, దేవరాజు, అమరనాథ్, దేవప్పనాయుడు, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, నారాయణస్వామి పాల్గొన్నారు.